# స్నేహ లేఖ

పగడాల హరిప్రసాదరావు
(జాతీయ రచనామండలి)

రాజా!

చాల రోజులనుండీ లేఖలు లేవు. కారణం ఏమాత్రం తోచడం లేదు. ఎప్పుడో వ్రాస్తావు. అందులో ఏమీ వుండదు. రానురాను నీవుత్తరాలు టెలిగ్రామ్స్‌లా మారిపోతున్నాయి. స్నేహితులకు లేఖలు వ్రాయడానికి అంత బద్ధకంగా వుంటుందా? వుండదూ మరి!

ఎన్ని రోజులనుంచో ఎదురుచూస్తున్నా—వెచ్చని టీ త్రాగి గదిలో కూర్చుని నీవు వ్రాసిన లేఖ చదువుకోవాలి అని. ఆ కోరికతో నేను మత్యపు చిప్పనే అయిపోయాను. నాకు నీవు లేఖలు వ్రాయకపోయినా నీ "గిరిజ" లేఖలు చదువుతూన్నా.

మిత్రమా! ఎంత చక్కగా వున్నయా లేఖలు! ఒక్కో లేఖ చదువుతూంటే హృదయం ఉప్పొంగి పోతూంది. నిజమే! ఆమె వ్రాసినట్లుగా—మన దేశంలో చాలమందిలో నిజమైన విజ్ఞానం క్షీణించి పోతూంది. విద్యాధికులమని విర్ర వీగే వీరంతా దాసులై పోతూన్నారు. దీనికంతా కారణం ఏమంటావు? పాశ్చాత్య వ్యామోహ ప్రభావమే!

ఛాయమ్మ వలె—నాలుగైదు సంవత్సరాలు పట్నవాసపు కుళ్ళు వాయువు పీల్చేటప్పటికి—తను చిన్నప్పటినుండీ పుట్టి పెరిగిన పల్లెలను—హృదయానికి ఎంతో వుల్లాసాన్ని కలిగించే నిర్మల వాయువును ప్రసాదించే గ్రామాలను—మరచి పోయి—రోజుకు వీశెడు దుమ్మును శరీరంలోకి ఎక్కించే పట్టణాలను—ఏవైపు వెళ్ళినా మురికి కాలువలతో ప్రత్యక్షమయ్యే పట్టణాలను—రాత్రిపూట నిదర పట్టనివ్వకుండా సంగీతం పాడే దోమలకు ఆశ్రయమిచ్చే ఆ వెధవ పట్టణాలను—ఎంతో పొగుడుతూ తన జన్మస్థానాన్ని అసహ్యించుకునే వారెంత మందో వున్నారు.

తండ్రికిష్టం లేకపోయినా—తల్లి పట్టుదలతో తన పల్లెను వీడి పట్నవాసానికి వస్తాడు విద్యాభ్యాసానికై. తన ముద్దుబిడ్డ ఉన్నత విద్యాభ్యాసం చేసి కలక్టరవుతాడని కలలుకంటూ వుంటారా జననీ జనకులు. కాని, తమ పుత్రుడు-తను ఎందుకు వచ్చాడో మరచిపోయి—పట్టణపు కృత్రిమాలకు దాసుడై పోయి—తన తల్లిదండ్రులను—తన విద్యను—మరచిపోతాడని వూహించలేరు.

మనలో అనేక మంది అభిప్రాయం ఏమిటో తెలుసా? విద్య నభ్యసించడం ఉద్యోగం చేయడానికే అని. తమకు ఎంత సంపద వున్నా—తమ పుత్రుడు బి. ఎ. ప్యాసయ్యాడంటే—ఉద్యోగం కొరకు ప్రాకులాడే వారే! తాము ఏవిధంగా ధనవంతులయ్యారో—పరువు ప్రతిష్టల నార్జించుకున్నారో—మరచిపోయి—తమ పుత్రుడు ఆఖరికి ముప్పై రూపాయల ఉద్యోగంలో వుంటె—హారంతో ఉబ్బి తబ్బిబ్బులయిపోతారు.

ఎవరైనా ఒక యువకునిలో ఏ కొంచెం స్వాతంత్ర్య భావాలు వుండి—ఉద్యోగం చేయడానికి నిరాకరించాడా ఇంక ఆ తండ్రి పరవళ్లుచూడు. అనేక కఠిన వాక్కులతో అతనిని ఎంత నీచంగా చూడాలో అంత నీచంగా చూస్తారు.

ఎవరైనా "మీ అబ్బాయి ఏంచేస్తున్నాడండీ!" అని అడిగితే—ఆ తండ్రి "మా అబ్బాయా! తినడం—పడుకోవడం! ఏదో చచ్చి చెడి నానా తిప్పలూపడి సంపాదించింది వుందిగా అఖరుచేయడానికి! సగం అఖరయింది యీ చదువులకి—యింక మిగిలింది తినడానికి ఆఖరు. ఉద్యోగమా—సద్యోగమా! అంతా అఖరయ్యాక అడుక్కు తింటాడు. అందుకేగా బి. ఎ. ప్యాసయింది." అంటూ నానా మాటలు అంటాడు.

అంతేగాని, మా అబ్బాయికేమండీ ఉద్యోగం చేసి బానిస అవవలసిన ఖర్మం! ఏదో ఉన్నదానిని చూచుకుంటూ కాలం హాయిగా గడుపుకోవచ్చు.

విజ్ఞానాభివృద్ధికి చదివించాను గాని ఆ విధవ ఉద్యోగాపేక్షతో మాత్రం కాదు.'' అని జవాబు చెప్పే రోజు లెప్పుడొస్తవో! ఉన్నత విద్య నభ్యసించడం వుద్యోగానికే అన్న అభిప్రాయం—ఒక్క తలిదండ్రులకే కాదు. చాలమంది యువకులకు కూడా వుంది.

శాయీ! నీ "గిరిజ" ఒక్క విషయంలో చాల తప్పు చేసిందయ్యా! తనున్న పల్లెలో చదువుకునే వారు బహు తక్కువ. ఆ వున్నవారిలో—విదేశ వ్యామోహుల నీచకార్యాలు చూచి—దేశంలో జరిగే అనర్థకాలు విని—చదువుతూన్న వారిని మానిపించి సేద్యంలో పెట్టడం చాల తెలివి తక్కువ పని అని నా అభిప్రాయం.

మానవునికి విద్య ఎంతో ముఖ్యవసరం. కొంత మంది చేసే నీచకార్యాల వలన—ఆముప్పు అంతా విద్యకు చుట్టుకుంది. మానవుడు విజ్ఞానవంతుడు కావాలంటే విద్య వుండాలి. నీ "గిరిజ" నీకామాత్రం లేఖ వ్రాయగలిగిందంటే దేనివలన? విద్యవలనే! చదువుకునే వారిని మానిపించడం చాల తెలివితక్కువ. కాకపోతే, ఆమెకు జరిగిన సంఘటన వలన—ఆ వుద్రేకంలో అలా చేసింది అనుకుంటా. సేద్యం చేసుకుంటూ విద్య నెందుకు అభ్యసించకూడదు?

నీ "గిరిజ" చదువు మాన్పించే ప్రచారం చేయడంకన్నా మన దేశంలో—జాతీయతను మరచిపోయి—విజాతీయ అనుకరణకు దాసులై—మన విజ్ఞానం, మన సాంప్రదాయాలు, మనదేశ గౌరవాల్ని—తృణీకరిస్తున్న వారి హృదయాలలో జాతీయ బీజాన్ని నాటుతూ—పల్లీయుల మూఢాచారాలు—వారి అనర్థకమైన పనులు మాన్పించి—మహాత్ముని నిర్మాణ కార్యక్రమ సూత్రాలలో ఒకటయిన గ్రామ పునర్నిర్మాణానికి తోడ్పడితే—దేశమునకు ఎంతో సేవచేసింది అవుతుంది.

పల్లెపర్యటనం సలపాలని వుంది. అప్పుడు తప్పక "గిరిజ" గ్రామం వెడతాను. ఆమెకు వచ్చి చెబుతా. సెలవు.

నీ "గిరి"

